# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆన్‌లైన్ గేమ్స్‌ను నియంత్రించేందుకు ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ 2025-బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఏడాది మార్చి కల్లా 10 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**3.** **ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా తెలంగాణలోని ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో నీటి కుంటలో పడి ఆరుగురు చిన్నారులు మృతి చెందారు.**

**5.** **తెలంగాణలో వర్షాలతో దెబ్బతిన్న రహదారులు, వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలను రూపొందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

==========================

ఆన్‌లైన్ గేమ్స్‌ను నియంత్రించేందుకు ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ 2025-బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ బిల్లును నిన్న లోక్‌సభలో ప్రవేశపెట్టి.. మాట్లాడుతూ… ఆన్‌లైన్ మనీ గేమింగ్ సమాజంలో తీవ్రమైన ఆర్థిక మోసాలకు దారితీస్తుందని, వీటి ద్వారా అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ గేమ్స్ నుండి యువతను కాపాడేందుకు ఈ బిల్లు దోహదపడుతుందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ…

వాయిస్ 26 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఏడాది మార్చి కల్లా 10 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గృహ నిర్మాణ శాఖపై అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంకా ఇళ్లులేని పేద కుటుంబాలను గుర్తించి జాబితా రూపొందించాలన్నారు. సంక్రాంతి కల్లా 2 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబానికి సొంతిళ్లు ఉండాలని… ఇందుకోసం చేపట్టిన గృహనిర్మాణ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

--------------------------

ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా తెలంగాణలోని ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్‌లో సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయాలకు ముఖ్యమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..

వాయిస్ 22 సెకన్లు

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఢిల్లీ వెళ్లనున్నారు. ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఈ రోజు నామినేషన్ వేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్లనున్నారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు కూడా హాజరవుతారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పది ఎకరాల స్థలంలో కన్వెన్షన్ సెంటర్‌ను హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ -హడ్కో నిర్మించనుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సీఆర్‌డీఏ ఇందుకోసం 8 ఎకరాలు కేటాయిస్తూ తీర్మానం కూడా చేసిందని మరో 2 ఎకరాలు కేటాయించనుందని తెలిపారు. ఇందులో వివిధ కార్యాలయాల ఏర్పాటుకు ప్రపంచస్థాయి మౌలిక సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు. అంతర్జాతీయ కార్యక్రమాలకు ఈ సెంటర్ వేదికగా మారుతుందని కేంద్ర మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణలో వర్షాలతో దెబ్బతిన్న రహదారులు, వంతెనల శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలను రూపొందించాలని రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి నిన్న శ్రవణ మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలకు 854 కి.మీటర్ల రహదారులు దెబ్బతిన్నాయని, 25 చోట్ల తెగిపోయాయని చెప్పారు. త్వరితగతిన తెగిన రోడ్లు, కల్వర్టులకు పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలో “గిరిజన బహుళ ప్రయోజన మార్కెటింగ్ కేంద్రం” టి.ఎమ్.ఎమ్.సి. నిర్మాణానికి మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, చెంచు గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. గిరిజనుల వ్యవసాయ ఉత్పత్తులకు మధ్యవర్తులు లేకుండా మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించేందుకు ఈ కేంద్రం పనిచేస్తుందని మంత్రి తెలుపుతూ..

వాయిస్ .. 26 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లా, ఆస్పరి మండలం, చిగిలిలో నీటి కుంటలో మునిగి ఆరుగురు చిన్నారులు

మృతి చెందారు. ఐదవ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఆడుకుంటూ నీటికుంటలో పడి మరణించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన దురదృష్టకరమని విచారం వ్యక్తం చేస్తూ. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు అసంక్రమిక వ్యాధుల –ఎన్‌సీడీ 4.0 సర్వేను ప్రభుత్వం నిర్వహించనుంది. దీనిలో భాగంగా వచ్చే అక్టోబరు నుంచి ఇంటింటా వివరాలు సేకరించనుంది. సర్వే తీరుపై ఈరోజు నుంచి సెప్టెంబర్ 20 వరకు వైద్యులు, ఆరోగ్య సంరక్షణ సహాయకులకు వైద్య ఆరోగ్య శాఖ శిక్షణ ఇవ్వనుంది. తాజా సర్వేలో క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని గుర్తించనున్నారు. ఈ సర్వేపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారంతోపాటు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు తెలిపారు.

-------------------------

ప్రజలను తప్పుదోవ పట్టించే ఔషధాల ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. డ్రగ్ కంట్రోల్ అథారిటీ–డీసీఏ పనితీరుపై హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకందారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి కేసులోనూ నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఔషధాలను పరీక్షించేందుకు ప్రయోగశాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్ ..30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడురోజులపాటు ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

-------------------------

సమాజానికి వృద్ధులు చేసిన సేవలను గుర్తించి... మలి వయసులో వారికి అండగా వుండాలన్న ఉద్దేశ్యంతో ఈ రోజు జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే అనేక చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. వృద్ధుల దినోత్సవం సందర్భంగా వారి ప్రాథమిక అవసరాలు తీర్చడం, భద్రత కల్పించడం, ఇతరత్రా సంక్షేమ చర్యలు చేపట్టేలా ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

====================